## క్లుప్తంగా

### ఆలయ భూములను కాపాడాలని వినతి

కొందుర్గు: కొందుర్గు శ్రీలక్ష్మీనరసింహ్మస్వామి దేవాలయ భూములను కాపాడాలని ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు నరేందర్ శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీనరసింహ్మస్వామి పేరున 300 ఎకరాలకు పైనే ఉన్న భూమిని ఇతరులు ఆక్రమించుకుంటున్నారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన భూములపై కోర్టుల్లో కేసులు నమోదు కావడంతో పాటు దేవాలయానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించారు. తీర్పు ప్రకారం దేవాలయ భూములను మూడు నెలల్లో ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకొని దేవాలయ భూములను కాపాడాలని కోరారు.

### లార్డ్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపు

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి.. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తమ్యే ఉంది. షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ గండిపేటలోని లార్డ్స్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈవీఎం యంత్రాలను అధికారులు లార్డ్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు గురువారం రాత్రే తరలించారు. పోలింగ్ కేంద్రాల నుంచి నేరుగా అధికారులు ప్రత్యేక బస్సుల్లో భద్రత మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించారు. అయితే, కౌంటింగ్ కోసం ఎన్నికల సంఘం వారు నియమించిన వారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతించనున్నారు.

### మల్‌రెడ్డి గెలుపు కోసం..



శివాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం రాచకొండ గుట్టలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా హజరత్‌గాలిబ్ దర్గాలో ప్రార్థనలు కూడా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు పర్యాయాలు ఓటమి చెందినా భయపడకుండా ప్రజల కోసం రంగారెడ్డి పనిచేశారని కొనియాడారు. జనాలు కూడా అదే స్థాయిలో ఆయనను ఆదరించారని పేర్కొన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. ఇబ్రహీంపట్నం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా అధిక స్థానాలు దక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదగోని జంగయ్య గౌడ్, అంతటి రాజుగౌడ్, చెరుకు నర్సింహగౌడ్, మోగావత్ లక్ష్మా నాయక్, సుంకరి ప్రవీణ్, క్రాంతికుమార్, రాఘవ, రఫిక్, రాకేశ్‌రెడ్డి, శేషుపాల్‌రెడ్డి, రాజ్ కుమార్‌నాయక్, రమేశ్, శ్రీను, మాజీ సర్పంచ్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో మైసమ్మకు పూజలు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ జాతర ఉత్సవాలు భక్త జన సందోహం మధ్యనే వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం మైసమ్మకు ప్రత్యేక పూజలు, అర్చనలు మహాలింగార్చన, పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మైసమ్మ దేవతను దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, శిరోలీ తదితరులు ఉన్నారు.

# షాద్‌నగర్ బాద్‌షా ఎవరో?

**ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం**

- గత ఎన్నికల కంటే తగ్గిన పోలింగ్ శాతం
- పోలింగ్ సరళిపై అభ్యర్థుల మల్లగుల్లాలు
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న నేతలు



షాద్‌నగర్ పట్టణ ముఖ చిత్రం



బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్



కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్



బీజేపీ అభ్యర్థి అందెబాబయ్య



ఏఐఎఫ్‌బీ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల సంగ్రామం ముగిసింది.. రాజకీయ నేతల భవితవ్యం ఈవీఎంల్లో దాగి ఉంది. పోలింగ్ తీరుపై నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. గెలుపుపై అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా ఎవరు గెలుస్తారన్న విషయంపై జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఆదివారం బరిలో ఉన్న అభ్యర్థుల జాతకాలు బయటపడనున్నాయి.

**హోరాహోరీ**

షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో 14మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే, ప్రధానంగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అంజయ్యయాదవ్, కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్, బీజేపీ నుంచి అందెబాబయ్య, ఆల్‌ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పోటీ పడుతుండగా బీఎస్పీ నుంచి ప్రశాంత్‌కుమార్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి వినయ్‌కుమార్, ధర్మసమాజ్ పార్టీ నుంచి మంచాల భిక్షపతి, స్వతంత్ర అభ్యర్థులుగా తుప్పుడు నర్సయ్య, మంచాల చంద్రమౌళి, నర్సింహ్మా రుస్తుం, అందారి అంజయ్య, రాఘవేందర్, ఆల్ ఇండియా సమతా పార్టీ నుంచి రహమద్దీన్, జై స్వరాజ్ పార్టీ నుంచి మహ్మద్ ఖాజా ముఫిజుద్దీన్‌లు బరిలో ఉన్నారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే ధ్యేయంగా నువ్వా నేనా అన్న రీతిలో హోరాహోరీగా ప్రచారాలను నిర్వహించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. అభ్యర్థులు రెండు నెలల పాటు క్షణం తీరిక లేకుండా ప్రచారాల జోరును కొనసాగించారు.

**పోలింగ్ సరళిపై అంచనాలు**

షాద్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 81.96 పోలింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఎంతో ఆసక్తి కనబరిచారు. నియోజకవర్గంలో మొత్తం 2,36,338 ఓటర్లు ఉన్నారు. 1,93,714 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 97,594, మహిళలు 95,089, ఇతరులు 1, ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 81.96 శాతం పోలింగ్ జరిగింది. 2018 ఎన్నికల కంటే ఈ సారి ఐదు శాతం పోలింగ్ తక్కువైంది. పోలింగ్ బూతుల వారీగా పోలైన ఓట్ల ఆధారంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడికలు తీసివేతలు వేసుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**విజయంపై ఎవరి ధీమా వారిదే..**

నియోజకవర్గంలో ఎవరు విజయం సాధిస్తారన్న విషయంపై ప్రజల్లో ఉత్కంఠ రేగుతుంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రచార అస్త్రాలుగా మలుచుకున్నాడు. కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. బీజేపీ అందెబాబయ్య కేంద్రంలోబీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ , రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వంటి వాటిని ప్రధానంగా ఎన్నికల ప్రచారంలో ప్రజలకు వివరించారు. అయితే, బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి బరిలో నిలిచారు. ఎవరు గెలుస్తారన్న విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. షాద్‌నగర్ బాద్‌షా ఎవరు రేపు తేలనుంది.

## గెలుపుపై ఎవరి ధీమా వారిదే...

**లెక్కలేసుకుంటున్న పార్టీల నేతలు**

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. గతం కంటే ఓటింగ్ శాతం కాస్త తగ్గడంతో ప్రధాన పార్టీల నేతలు ఎవరికి వారే లెక్కలేసుకుంటున్నారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో 74.18 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,62,005 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,94,343 ఓట్లు పోలయ్యాయి.

**లెక్కల్లో మునిగిన నేతలు...**

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసి ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు చేరడంతో ఇక ప్రధాన పార్టీల నేతలంతా లెక్కలో మునిగారు. తమ అభ్యర్థులకు ఏయే గ్రామాల్లో ఎన్ని ఓట్లు వచ్చాయో అనే అంచనాలు వేసుకుంటున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు శుక్రవారం గ్రామాల వారీగా పోలైన ఓట్ల వివరాలను సేకరించి అందులో తమకు ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయని లెక్కలు రాసుకుంటున్నారు. ఏయే గ్రామాల్లో తమకు బలముందో చూసుకుంటూ తమకు లీడ్ వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులంతా ఇలా లెక్కలేసుకుంటూ తమ పార్టీ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం ఆదివారం తేలనుంది.

**యువ ఓటర్లు ఎక్కడ మొగ్గారు...?**

ఈ సారి ఎన్నికల్లో యువ ఓటర్లు భారీగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చినవారు సైతం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. అయితే ఈ సారి యువతరం ఎక్కడ మొగ్గిందనే అంశాన్ని రాజకీయ పార్టీలు విశ్లేషించుకుంటున్నాయి.



మొయినాబాద్: ఓటింగ్‌పై లెక్కలేసుకుంటున్న నాయికులు

ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీల ప్రచారాల్లో యువతే అధికంగా కనిపించింది.ఏది ఏమైనా అభ్యర్థుల భవితవ్యం బయటపడాలంటే రేపటి వరకు ఆగాల్సిందే.

# ఓటరు తీరు మారలే!

- ఓటుకు దూరంగా 42,642 మంది
- 2018 ఎన్నికలతో పోలిస్తే షాద్‌నగర్‌లో తగ్గిన పోలింగ్ శాతం
- 1,93,714 మంది ఓటు హక్కు వినియోగం



కిషన్‌నగర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు

షాద్‌నగర్: ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పించినా ఓటరు మారలేదు. ఓటేసేందుకు చాలా మంది గడప దాటలేదు. 2018 ఎన్నికలతో పోలిస్తే షాద్‌నగర్‌లో పోలింగ్ శాతం తగ్గింది. యువకులు, విజ్ఞాన వంతులు ఓటు హక్కును వినియోగించుకోలేదు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ మండలాల పరిధిలో మొత్తం 2,36,338 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,19,045 మంది, మహిళలు 1,17,278 మంది, థర్డ్ జెండర్లు 15 మంది ఉన్నారు. ఈ సారి ఎన్నికల్లో 1,93,714 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ లెక్కన 42,642 మంది ఓటు హక్కు వినియోగానికి దూరంగా ఉన్నట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి 47,283 మంది ఓటర్లు కొత్తగా ఓటు హక్కు పొందారు. అయినా ఈ సారి మాత్రం పోలింగ్ శాతం బాగా తగ్గింది. మహిళల కంటే పురుషులు ఎక్కువ శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**నష్టం ఎవరికో..?**

2018 ఎన్నికల్లో 88శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఈసారి మాత్రం 81.96 శాతం వద్దే ఆగిపోయింది. తగ్గిన పోలింగ్ శాతంతో ఎవరికి నష్టం జరుగుతుందోననే చర్చ కొనసాగుతోంది. గెలుపు అవకాశాలపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు.

### విద్యార్థులకు ప్రశంసలు

బడంగ్‌పేట్: పల్లవి, ఆవేర్ ఇంటర్నేషనల్ స్కూల్ సరూర్‌నగర్ ఆధ్వర్యంలో 'రసాజ్ఞ ది నవరస–23' పేరుతో వార్షికోత్సవాలు నిర్వహించారు. టాలెంట్–21 సీఈఓ గురిందర్‌పాల్‌సింగ్, డీపీఎస్, పల్లవి విద్యాసంస్థల సీఈవో మల్కా యశస్వి, అకాడమిక్ డైరెక్టర్ సుధ తురగ, స్కూల్ డైరెక్టర్ అనితారెడ్డి, ప్రిన్సిపాల్ చారుజైన్ వేడుకలు ప్రారంభించారు. నాటక, క్రీడలు, కరాటేలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు.

# లెక్కలే లెక్కలు.. 'గులాబీ'లో గుబులు

**ఓటింగ్ సరళిపై సుదీర్ఘ చర్చలు**

- ఎక్కడ చూసినా పోలింగ్ తీరుపైనే ముచ్చట్లు
- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఓటింగ్ సరళిపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనుండటంతో ఏ గ్రామంలో తమ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి. తక్కువ, ఎక్కువలు వస్తాయని అంచనా వేస్తున్న గ్రామాల్లో కారణాలేమిటి, తదితర అంశాలపై లెక్కలు వేస్తూ అన్ని పార్టీల నాయకులు శుక్రవారం బిజీబిజీగా కనిపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పర్యటించి పార్టీ నాయకులను కార్యకర్తలను కలిసి ఓటింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్నికల్లో మనకు అనుకూలంగా ఉన్న గ్రామాల్లో ఓట్లతో మనం మూడవసారి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ చర్చలు**

కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శుక్రవారం పర్యటించి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఓటింగ్ సరళిపై చర్చించారు. మండలాలు, గ్రామాల్లో ఓటింగ్ సరళి ఎలా ఉంది.. అక్కడ మన పార్టీ బలం బలహీనతలు ఎలా ఉన్నాయని చర్చించారు.

**ఓటరు నాడి తెలియక తికమక**

గ్రామాల్లో ఇరుపార్టీలకు ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తుండటంతో నాయకులు తమకు ప్రజల మద్దతు ఉందని తమదే విజయమని అనుకుంటున్నారు. నిజంగా ప్రజలు ఎవరికి పట్టం కడుతారో తెలియక తికమక పడుతున్నారు. ఓటరు నాడి తెలుసుకునేందుకు ప్రయత్నించిన ప్రజలు ఎవరు వెళ్తే వారికే అనుకూలంగా సమాధానాలు చెప్పటంతో సర్వేలు సైతం ఎటు తేల్చలేకపోతున్నాయి. ఈ సారి రాజకీయం పూర్తిగా గతంలో కంటే భిన్నంగా ఉందని అంటున్నారు. ఓటర్లు సైతం నాయకులు చెప్పే మాటలు నమ్మే పరిస్థితి కనిపించటం లేదంటున్నారు. దీంతో ప్రధాన పార్టీల నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సందిగ్ధం తొలగాలంటే రేపటి వరకు ఆగాల్సిందే..

**సరదా.. సరదాగా**

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు కాళ్లకు చక్రాలు కట్టుకొని గ్రామగ్రామాన తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగియడంతో అభ్యర్థులకు కొంత విశ్రాంత లభించింది. అభ్యర్థులు కుటుంబ సభ్యులతో, పార్టీ నేతల ఇళ్ల వద్ద వెళ్లి సరదాగా గడుపుతూ పోలింగ్ సరళిపై చర్చించుకున్నారు.

- బీఆర్‌ఎస్ అభ్యర్థుల్లో ఫార్మా టెన్షన్
- భూ బాధితులు ఎవరికి ఓటేశారోనని ఆందోళన
- మూడు నియోజకవర్గాల్లో ప్రభావం చూపనున్న ఓటర్లు
- అభివృద్ధిపైనే ఆశలు పెట్టుకున్న అధికారపార్టీ అభ్యర్థులు
- కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించేనా..?



శ్రీశైలం హైవే నుంచి మీరాఖాన్‌పేట్ మధ్యన ఫార్మాసిటీ రోడ్డు

యాచారం: అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఫార్మాసిటీ గుబులు పట్టుకుంది. బాధిత గ్రామాల్లోని ఓటర్లు ఎటు వైపు ఓటేశారోనని ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ సర్కార్ రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులోని 19,333 ఎకరాల్లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. మూడు నియోజకవర్గాల్లో 10 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములను ఫార్మాసిటీకి సేకరించారు. భూములిచ్చిన అసైన్డ్ రైతులకు ఎకరాకు రూ.8 లక్షలు, పట్టా రైతులకు రూ.16 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. సేకరించిన భూముల్లో గుట్టలు, రాళ్లు, రప్పలు చదును చేసి రోడ్లు కూడ వేశారు. అసైన్డ్ రైతులు తమ భూములను ఎలాంటి షరతులు విధించకుండా ఇచ్చారు. కానీ పట్టా రైతులు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫార్మాకు భూములివ్వమని మొదటి నుంచి చెబుతున్నారు. భూములివ్వని రైతుల భూ రికార్డులను ధరణి పోర్టల్‌లో సమాచారం లేకుండానే టీఎస్‌ఐఐసీ పేరు మీద మార్చేశారు. అప్పటి నుంచి ఆ రైతులకు రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు, అత్యవసర పరిస్థితుల్లో భూములను విక్రయించడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో బాధితులు అధికారపార్టీపై గుర్రుగా ఉన్నారు.

**కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను నమ్మినట్లేనా..?**

అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, న్యాయస్థానాల తీర్పు ప్రకారం తిరిగి ఆ రైతులకే భూములు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో స్పష్టం చేసింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల పరిధిలోని ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, మీరా ఖాన్‌పేట్, పంజాగూడ, ఆకులామైలారం, కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని ముద్వీన్, కర్కల్‌పహాడ్, పల్లెచల్కతండాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. యాచారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో 9,500 ఓట్లు, కందుకూరు మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో 12 వేలు, కడ్తాల్ మండల పరిధిలోని 6 వేల ఓట్లు ఉన్నాయి. మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మాత్రం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నువ్వా.. నేనా అన్నట్లు తలపడ్డారు.

**అభివృద్ధిపైనే ఆశలు**

బీఆర్‌ఎస్ సర్కార్ ఫార్మాసిటీ ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మహేశ్వరం నియోజవర్గ పరిధిలోని శ్రీశైలం హైవే కందుకూరు గేట్ నుంచి మీరాఖాన్‌పేట వరకు వంద అడుగుల రోడ్డును విస్తరించింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం మండల కేంద్రం సాగర్ హైవే నుంచి రూ.70 కోట్ల నిధులతో మీరాఖాన్‌పేట వరకు రోడ్డు విస్తరించాలని నిర్ణయం తీసుకుంది. అయితే కొన్ని కారాణాల వల్ల రోడ్డు పనుల్లో జాప్యం జరిగింది. వ్యతిరేకతను తగ్గించేందుకు, భూములు కోల్పోయిన రైతులకు మీరాఖాన్‌పేట సమీపంలో 600 ఎకరాల్లో అన్ని సౌకర్యాలతో హెచ్‌ఎండీఏ వెంచర్‌లో 121 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించారు. ఇప్పటికే రైతు కుటుంబాలకు పట్టాలు కూడా అందజేశారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి యాచారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో టీఎస్‌ఐఐసీ నుంచి రూ. 10 కోట్లకు నిధులతో సీసీ రోడ్లు వేయించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజా వ్యతిరేకతను పసిగట్టిన అధికార పార్టీ అభ్యర్థులు ఆయా గ్రామాల్లో అభివృద్ధి చూసి కారు గుర్తుకు ఓటు వేస్తారని భావించారు. అయితే ఈ ఉత్కంఠకు 3వ తేదీన తెరపడనుంది.

కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆచారి ముందు నుంచి ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి.. ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా కృషి చేశారు. వీరిని ఆ గ్రామాల రైతులు నమ్మినట్టయితే హస్తం గుర్తుకు భారీగా ఓట్లు పడే అవకాశం లేకపోలేదు.



విజయనగర్ కాలనీలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా..



అమీర్‌గూడలో పాఠశాల పక్కన కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

## కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

**పొంచి ఉన్న ప్రమాదాలు**

మొయినాబాద్: కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రోడ్ల పక్కన, ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో కరెంట్ షాక్‌కు గురై పశువులు, మనుషులు చనిపోతున్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ, చిలుకూరు, పెద్దమంగళారం, చిన్నమంగళారం, రెడ్డిపల్లి, సురంగల్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగి ఆవులు, గేదెలు, మేకలు చనిపోయాయి. ఎత్‌బార్‌పల్లి, నాగిరెడ్డిగూడ, సజ్జన్‌పల్లి తదితర గ్రామాల్లో మనుషులకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కరెంటు షాక్ తగిలి మరణించారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లో ఇనుప స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన





ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యకళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

చేవెళ్ల: ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని దీనిపై అవగాహన, జాగ్రత్తలే ముఖ్యమని ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన వచ్చిందని మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలోని విద్యార్థులకు, రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధి అయినప్పటికీ దీనిపై సరైన వైద్య సలహాలు, పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చునని తెలిపారు. వ్యాధి ఉన్న వారిని ఎవరు దూరం పెట్టవద్దని వారిని అమర్యాదగా చూడవద్దన్నారు. అలా చేస్తే నేరమని తెలిపారు. ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు, విద్యార్థులకు వివరించారు. ఎయిడ్స్ వ్యాధికి సంబంధించి పూర్తి వైద్యం చికిత్స పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో అందుబాటులో ఉందన్నారు. తక్కువ ధరలో వైద్య సేవలు అందుతాయని చెప్పారు. దీనిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ అశోక్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర్‌రావు, డాక్టర్ పవిత్ర, డాక్టర్ విష్ణు, సిబ్బంది వినోద్, ప్రసాద్, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.